

కనుల పండువగా ఆవులపబ్బం

చౌడేపల్లె మండలంలోని పన్నెండు గ్రామాల ప్రజలు పరికిదొన గ్రామంలో ఆవులపబ్బం పండుగను ఘనంగా జరుకున్నారు. - 8లో



వైభవంగా లక్ష కుంకుమార్చన


పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన రెండో రోజు వైభవంగా జరిగింది. - 8లో



6 కేజీల బంగారం వితరణ

కాణిపాకం ఆలయానికి పలువురు ఎన్ఆర్ఐలు గురువారం 6 కిలోలు బంగారాన్ని విరాళంగా అందించారు. - 8లో

ఆల్ ది బెస్ట్


పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

నాడు

టీడీపీ పాలనలో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయాలంటే విద్యార్థులు నేల పైన కూర్చొని రాసే పరిస్థితి ఉండేది. పరీక్ష కేంద్రాల్లో సరైన మౌలిక వసతులు ఉండేవి కాదు. కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నీచర్ సౌకర్యాలు లేకపోవడంతో పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

నేడు

వైఎస్సార్‌సీపీ సర్కారు నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలు మార్చింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించింది. దీంతో నేటి నుంచి జరిగే ఇంటర్ పరీక్షలను విద్యార్థులు డెస్కులపై కూర్చుని రాయనున్నారు.

- నేటి నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం
- నో సెల్‌ఫోన్ జోన్‌లుగా పరీక్ష కేంద్రాలు
- అరగంట ముందుగానే సెంటర్లకు చేరుకోవాలని విద్యార్థులకు సూచన
- ప్రతి రూములో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. చిత్తూరు జిల్లాలో పరీక్షల నిర్వహణకు 50 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారి చొప్పున మొత్తం 100 మందిని నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్లు 50 మంది, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. వీరితో పాటు 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 750 మంది ఇన్విజిలేటర్లు, 2 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షా పత్రాలు, పరీక్షకు సంబంధించిన గోప్యమైన వస్తువులు, పత్రాలను భద్రపరచడానికి 25 స్టోరేజీ పాయింట్లను అందుబాటులోకి తెచ్చారు.

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు..
మార్చి 1న సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1, 4న ఇంగ్లిష్ పేపర్–1, 6న గణితం పేపర్–1ఏ, బోటనీ పేపర్–1, సివిక్స్ పేపర్–1, 9న గణితం పేపర్–1బీ, జువాలజీ పేపర్–1, హిస్టరీ పేపర్–1 పరీక్షలు జరుగుతాయి. 12న ఫిజిక్స్ పేపర్–1, ఎకనామిక్స్ పేపర్–1, 14న కెమిస్ట్రీ పేపర్–1, కామర్స్ పేపర్–1, సోషియాలజీ పేపర్–1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్–1, 16న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్–1, లాజిక్ పేపర్–1, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు గణితం పేపర్–1, 19వ తేదీన చివరి పరీక్షగా మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్–1, జాగ్రఫీ పేపర్–1 పరీక్షలు జరుగుతాయి.

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు..
మార్చి 2న సెకండ్ లాంగ్వేజ్ పేపర్–2, 5న ఇంగ్లిష్ పేపర్–2, 7న గణితం పేపర్–2ఏ, బోటనీ పేపర్–2, సివిక్స్ పేపర్–2, 11న గణితం పేపర్–2బీ, జువాలజీ పేపర్–2, హిస్టరీ పేపర్–2 పరీక్షలు జరుగుతాయి. 13న ఫిజిక్స్ పేపర్–2, ఎకనామిక్స్ పేపర్–2, 15న కెమిస్ట్రీ పేపర్–2, కామర్స్ పేపర్–2, సోషియాలజీ పేపర్–2, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్–2, 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్–2, లాజిక్ పేపర్–2, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు గణితం పేపర్–2, 20వ తేదీన చివరి పరీక్షగా మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్–2, జాగ్రఫీ పేపర్–2 పరీక్షలు జరుగుతాయి.



పరీక్షల షెడ్యూల్ ఇలా..

మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమై 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. పరీక్షకు, పరీక్షకు మధ్య ఒక రోజు విరామం వచ్చేలా షెడ్యూల్‌ను రూపొందించారు. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, రెండో రోజు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి.


పీసీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన డెస్కులు

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 32,757


ఈ పరీక్షలకు జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 32,757 మంది హాజరుకానున్నారు. పరీక్షలు షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, విభిన్న ప్రతిభావంతులకు 9 గంటల నుంచి 1 గంట వరకు పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 58 మంది విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించడంతో విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, బోధనేతర సిబ్బంది, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కలిగి ఉండకూడదు. విద్యార్థులు పరీక్షలు రాసే గదుల్లో, వరండాల్లో, మెయిన్‌గేట్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే ప రీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలుకు ఆదే శాలు ఇచ్చారు. ఎటువంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

భయాందోళన లేకుండా రాయాలి..



విద్యార్థులు భయాందోళన చెందకుండా పరీక్షలు రాయాలి. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షలు ముగిసేవరకు విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్షా కేంద్రాలకు ప్రయాణించవచ్చు. ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్. – షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

మంచి వాతావరణంలో రాసేలా..



ఇంటర్ విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 08572–293867 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలపవచ్చు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించం. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారం తీసుకుంటున్నాం.
– సయ్యద్ మౌలా, ఇంటర్, డీవీఈఓ, చిత్తూరు

న్యూస్‌రీల్

కృపాలక్ష్మిని ఆశీర్వదించండి
– డిప్యూటీ సీఎం నారాయణస్వామి


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: 'ఉన్నత చదువులు అభ్యసించి రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్న నా కుమార్తె కృపాలక్ష్మిని నాపై చూపించిన ఆదరణను నా బిడ్డపై చూపించి ఆమె విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని' రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం కార్వేటినగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత మూడేళ్లుగా తన కుమార్తె కృపాలక్ష్మిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించాలన్న తన అభ్యర్థన మేరకు టికెట్ ఇచ్చిన సీఎం వైఎస్ జగనన్నకు తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు తన గెలుపునకు ఎలా కృషి చేశారో, అదేవిధంగా తన కుమార్తె కృపాలక్ష్మిని ఆశీర్వదించి జగనన్నకు కానుకగా అందజేయాలని పిలుపునిచ్చారు. తన కుమార్తెకు ఎమ్మెల్యే టికెట్ రావడానికి కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి ఈ సందర్భంగా మంత్రి నారాయణస్వామి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి వెంట ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి, ధనశేఖర్‌వర్మ, పలువురు ఉన్నారు.

నేడే జగనన్న విద్యాదీవెన

- జిల్లాలో 32,427 మంది విద్యార్థులకు లబ్ధి
- 29,407 మంది తల్లుల ఖాతాల్లో రూ.20,54,29,471 నిధులు జమ చేయనున్న సర్కారు
- కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకం ఈ నెల 1న ప్రారంభించనున్నారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు మండలం నుంచి ప్రారంభిస్తారన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ విద్యాసంవత్సరం మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోని 32,427 మంది విద్యార్థులకు గాను 29,407 మంది తల్లుల ఖాతాల్లో రూ.20,54,29,471 నిధులను రాష్ట్రప్రభుత్వం డీబీటీ విధానంలో జమ చేయనుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

జిల్లాలో పలువురు ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పలు ప్రాంతాలల్లో పనిచేస్తున్న ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ జాషువా ఆదేశాలు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..కాణిపాకంలో ఉన్న పి.శ్రీనివాసరావును గుడిపాలకు, అక్కడ ఉన్న కె.రామ్మోహన్‌ను కాణిపాకానికి, చిత్తూరు వన్‌టౌన్‌లో ఉన్న బి.భారతిని స్పెషల్‌బ్రాంచ్‌కు, చిత్తూరు సీసీఎస్‌లో ఉన్న టి.ప్రసాద్‌ను టూటౌన్‌కు, గంగాధర నెల్లూరులో ఉన్న బి.రామాంజనేయులును యాదమరికి, గంగవరంలో ఉన్న యు.ప్రతాప్‌రెడ్డిను చౌడేపల్లెకు బదిలీ చేశారు. అలాగే చిత్తూరు సీసీఎస్‌లో ఉన్న ఇ.బాబును వి.కోటకు, చిత్తూరు ట్రాఫిక్‌లో ఉన్న ఇ.జయప్పను చిత్తూరు డీసీఆర్‌బీకి, ఐరాలలో ఉన్న యు.వెంకటేశ్వర్లను వెదురుకుప్పానికి, ఇక్కడ ఉన్న బి.రమేష్‌బాబును ఐరాలకు, వీఆర్‌లో ఉన్న కె.స్వర్ణతేజను చిత్తూరు డీసీఆర్‌బీకి, బి.సుబ్బారెడ్డిని చిత్తూరు డీటీసీకి, ఎం.రాజకుళ్లాయప్పను ఎస్‌ఆర్ పురానికి, కె.శాంతమ్మ చిత్తూరు దిశ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అలాగే ఎస్.లోకేష్‌ను పెనుమూరుకు, వై.సుమన్‌ను నగరికి, సి.వెంకటేశ్వర్లును చిత్తూరు డీటీసీకు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎంకె.ప్రవీణ్ కుమార్‌ను కుప్పంకు, జి.నాగేంద్రకుమార్‌ను చిత్తూరు వన్‌టౌన్‌కు, ఎ.వెంకటకృష్ణను కార్వేటినగరానికి, డి.శేషగిరిని చిత్తూరు తాలూకాకు, ఎ.వెంకట నారాయణను నింద్రకు, ఎస్.వెంకటరాముడును విజయపురానికి, జి.రామచంద్రయ్యను నగరి అర్బన్‌కు, జి.ఇక్బాల్‌ను చిత్తూరు టూటౌన్‌కు బదిలీ చేశారు.

చింతపండు వ్యాపారుల కోసం శీతల గిడ్డంగులు

- టీడీపీ పాలనలో చింతపండు వ్యాపారులపై వేధింపులు, కేసులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యలపై దృష్టి
- సీఎం, ఎంపీ కృషితో ట్యాక్స్ మినహాయింపు ఇచ్చిన కేంద్రం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


పుంగనూరులో కోల్డ్ స్టోరేజ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: చింతపండు వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన పుంగనూరులో శీతల గిడ్డంగులు నిర్మించడం ఎంతో అవసరమని, ఈ దిశగా వ్యాపారులకు కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి ముందుకురావాలని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చిత్తూరు రోడ్డులో ఎస్ఎస్‌బి కోల్డ్ స్టోరేజ్‌ను ఎంపీ రెడ్డెప్పతో కలసి మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పుంగనూరులో చింతపండు తయారీ కుటీర పరిశ్రమగా సుమారు 20 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చింతపండు వ్యాపారులు గత ప్రభుత్వంలో ట్యాక్స్‌లు చెల్లించలేక వేధిన పడ్డారన్నారు. చింతపండు వ్యాపారుల సమస్యలను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పట్టించుకోకుండా, కమర్షియల్ ట్యాక్స్ అధికారులతో దాడులు చేయించడమే కాకుండా కేసులు సైతం బనాయించి వేధించిందని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో చింతపండు వ్యాపారులు తమ సమస్యలను ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి నివేదించడంతో ఆయన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారన్నారు. అప్పట్లో దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం తరపున కేంద్రానికి నివేదికలు పంపారన్నారు. అలాగే మిథున్‌రెడ్డి స్వయంగా కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌తో పలుమార్లు చింతపండు ట్యాక్స్ మినహాయింపు విషయమై చర్చించారన్నారు. తదనంతరం కేంద్ర ప్రభుత్వం చింతపండుకు ట్యాక్స్ లేకుండా ఉత్తర్వులు జారీ చేసిందని, ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో చింతపండు వ్యాపారులకు విముక్తి లభించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషితో చింతపండు వ్యాపారులకు ట్యాక్స్‌ల మినహాయింపు, కమర్షియల్ ట్యాక్స్ అధికారుల వేధింపులు తప్పి వ్యాపారులు సంతోషంగా ఉన్నారన్నారు. చింతపండు వ్యాపారులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వారికి అండగా ఉండి, పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అలాగే శీతల గిడ్డంగులు, గోదాములు నిర్మించేందుకు ముందుకు వస్తే వారికి ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కోల్డ్ స్టోరేజ్ యజమానులు డాక్టర్ శరణ్, హరిప్రసాద్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలకు చురుగ్గా ఏర్పాట్లు

- మార్చి 3న జిల్లావ్యాప్తంగా పోలియో చుక్కలు వేసే కార్యక్రమం
- జిల్లాలో 0–5 ఏళ్లలోపు 2,09,971 పిల్లల గుర్తింపు

చిత్తూరు రూరల్: జిల్లావ్యాప్తంగా మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లా అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అధికారులు శరవేగంగా కసరత్తు చేశారు. జిల్లాలో 2,09,971 మందికి పంపిణీ పల్స్ పోలియో చుక్కలు వేసేలా ప్రణాళికలు రూపొందించారు. 'పల్స్ పోలియో' విజయవంతానికి సంబంధించి ఇప్పటికే డీఎంహెచ్ ప్రభావతిదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు, మెడికల్ ఆఫీసర్లు, ఇతర అధికారులకు శిక్షణ ఇచ్చారు.

మూడు దశల్లో..
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే చిన్నారులకు 3 దశల్లో పోలియో చుక్కలు వేయనున్నారు. అందుకోసం జిల్లాలో 1,415 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లు 112 మంది, కోర్ గ్రూప్ ఆఫీసర్లు 08, సూపర్‌వైజర్లు 1530, ఆశా వర్కర్లు–1,989, ఏఎన్ఎంలు–612 మంది పాలుపంచుకోనున్నారు. 206 మొబైల్ బృందాలు హైరిస్క్ ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లు తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేస్తారు. ఒకవేళ ఎవరైనా తమ చిన్నారికి మార్చి 3న చుక్కలు వేయించకుంటే తర్వాత రెండు రోజులు ఆశా, ఏఎన్ఎంలు ఆ ఇళ్లకే వెళ్లి వేసేలా ఏర్పాట్లు చేశారు.

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం..



మార్చి 3న జిల్లావ్యాప్తంగా పోలియో చుక్కల పంపిణీని ప్రారంభిస్తాం. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. మార్చి 4, 5 తేదీల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారు. తల్లిదండ్రులు బాధ్యతగా చిన్నారులకు చుక్కల మందు వేయించాలి. వందశాతం లక్ష్యం పూర్తయ్యేలా అధికారులు సమిష్టిగా పనిచేయాలి.
– రవిరాజు, డీఐఓ, చిత్తూరు

వీరమాసి చెరువుకు కృష్ణా జలాలు



కుప్పానికి హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు వస్తున్నాయి. కాలువల ద్వారా చెరువులకు నీరు చేరుతోంది. బుధవారం మిట్టపల్లి సమీపంలోని మద్దికుంట చెరువు నిండిన తరువాత గురువారం అత్తికుప్పం సమీపంలోని వీరమాసి చెరువుకు నీటిని విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీ–నీవా కాలువ ద్వారా కుప్పానికి కృష్ణాజలాలను విడుదల చేయడంపై కుప్పం ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు బోర్‌వెల్ చెంగారెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, కేశవ రెడ్డి, కుమార్ రెడ్డి, అశోక్ పాల్గొన్నారు. – రామకుప్పం

మెగా జాబ్ మేళాలో 397 మందికి ఉద్యోగాలు

నగరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నతవిద్య కమిషనర్ డా.పోలా భాస్కర్ ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాలో 653 మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 397 మంది ఎంపికయ్యారు. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ జాబ్‌మేళాకు నగరి, పుత్తూరు, కార్వేటినగరం, సత్యవేడు, శ్రీకాళహస్తిలోని రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు చొప్పున ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 433 మంది విద్యార్థులు, ఇతరులు 120 మంది పాల్గొన్నారు. పేటీఎం, డిక్సన్, అపోలో ఫార్మసీ, టెక్ మహీంద్ర, టాటా ఎలక్ట్రానిక్స్, అమేజాన్ వేర్‌హౌస్ తదితర 20 కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 6 కళాశాలల నుంచి 355 మంది, ఇతరులలో 42 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డా.ఆర్.వేణుగోపాల్ మాట్లాడుతూ వచ్చిన ఉద్యోగాల్లో నైపుణ్యతను ప్రదర్శించి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ మేళాలో పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి కళాశాల ప్రిన్సిపల్స్ శ్రీనివాసులు రెడ్డి, సురేష్‌బాబు, శ్రీలత, ఆంగ్ల అధ్యాపకులు, నోడల్ రీసోర్సస్ సెంటర్ సమన్వయకర్త డా.పంకజ, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్స్, కంపెనీల ప్రతినిధులు

నిష్పక్షపాతంగా పని చేయండి

చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రతీ ఒక్క పోలీసు అధికారి నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలపై మరింత దృష్టి సారించాలని చిత్తూరు ఎస్పీ జాషువా ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా పలువురు ఎస్‌ఐలను బదిలీ చేసిన నేపథ్యంలో, వారితో గురువారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఎక్కడా కూడా చిన్న ఆరోపణ లేకుండా విధులు నిర్వహించాలని, చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

స్వామివారికి వెండి బిందె, తట్ట వితరణ


ఆలయ అధికారులకు వెండిబిందె, తట్టను అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి హైదరాబాద్‌కు చెందిన దాత మల్లప్ప వెండి బిందె, తట్ట వితరణగా అందించారు. గురువారం ఉదయం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం కాణిపాకం విచ్చేశారు. స్వామివారికి 1కిలో 800ల గ్రాముల(సుమారు రూ.1.50 లక్షల విలువ) వెండి బిందె, తట్టను ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : అధికారులు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని డీఆర్‌ఓ పుల్లయ్య సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారుల బాధ్యతలపై సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నోడల్ అధికారులు బాధ్యతలను తూచా తప్పకుండా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 16 టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇకపై రోజూ మధ్యాహ్నం నుంచి కేటాయించిన సిబ్బందితో ఎన్నికల పనుల్లో నిమగ్నం కావాలని తెలిపారు. ఉన్నతాధికారులు అడిగే రిపోర్టులను వెంటనే పంపాల్సి ఉంటుదన్నారు. ఎన్నికల విధులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్య, 16 మంది నోడల్ ఆఫీసర్స్, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

టూరిజం కారిడార్‌గా కార్వేటినగరం

- ప్రభుత్వ సహకారంతో రాణిమహల్ అభివృద్ధి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


రాణిమహల్ ఆధునీకరణ జీఓను చూపుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: సంస్థానాధీశులు నిర్మించిన చారిత్రక కట్టడాలను ఆధునీకరించి పూర్వవైభవం తీసుకొచ్చి కార్వేటినగరాన్ని టూరిజం కారిడార్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాణిమహల్(లక్ష్మీమహల్)ను పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 900 సంవత్సరాల క్రితం కార్వేటినగరం సంస్థానాధీశులు నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక స్థానిక ఎంపీపీ లత, సర్పంచ్ ధనుంజయవర్మ రాణిమహల్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని, పట్టుపట్టడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై సీఎం జగనన్న సానుకూలంగా స్పందించి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆనాటి రాజులు ఈ భవనాలను ప్రభుత్వానికి స్వాధీనం చేయడంతో సుమారు 75 ఏళ్లపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలగా వినియోగించుకున్నట్లు చెప్పారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయం, స్కంధపుష్కరిణితో పాటు ఆళత్తూరు వరద వేంకటేశ్వస్వామి ఆలయం, కొటార్వేడు గ్రామంలో వెలసిన అగస్తీశ్వరస్వామి ఆలయం, పెనుమూరులో కనిగిరి వేంకటేశ్వర స్వామి ఆలయం, పాలసముద్రం మండలంలో మతవలంలో వెలసిన గోవర్ధనేశ్వరస్వామి ఆలయాలను టూరిజం పరిధిలోకి చేర్చుతామన్నారు. రాణిమహల్ ఆధునీకరణకు సహకరించిన మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కేరోజా, ఎంపీ మిథున్‌రెడ్డి, రాష్ట్ర విద్యా కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో చేపట్టనున్న రాణిమహల్ ఆధునీకరణ పనులను నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేస్తామని టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ అన్నారు. మార్చి మొదటి వారంలో భవనం ఆధునీకరణకు భూమిపూజ చేస్తామన్నారు. భవిష్యత్‌లో రాణిమహల్‌ను మ్యూజియంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, స్థానిక నాయకులు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్‌కు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్కియాలజిస్టు అడ్మినిస్ట్రేషన్ అధికారి అపర్ణ, డీఈ శ్రీనివాసులు, ఏడీ పవన్ కుమార్. ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి, హెచ్‌ఎం కోటేశ్వర రావు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయానికి 6 కేజీల బంగారం వితరణ


ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు బంగారాన్ని అందిస్తున్న దాతలు, ఎన్‌ఆర్‌ఐలు

- అంతరాలయంలో బంగారు వాకిలి పనుల కోసం ఎన్‌ఆర్‌ఐల విరాళం
- సుమారు రూ.5 కోట్లతో పనులు ప్రారంభం

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని అంతరాలయంలో బంగారు వాకిలి పనులు గురువారం రాత్రి ప్రారంభించారు. బంగారు వాకిలి తాపడం కోసం ఎన్‌ఆర్‌ఐలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్ వారి ప్రతినిధి గొట్టిపాటి రాజేంద్రప్రసాద్ గురువారం రాత్రి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు బంగారును బిస్కెట్ రూపంలో 6 కిలోలు విరాళంగా అందించారు. ఎన్‌ఆర్‌ఐలు తమ కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి బంగారు వాకిలి తాపడం కోసం బంగారం తీసుకురాగ వారికి ఆలయ చైర్మన్, ఈఓ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో బంగారానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐలు స్వామివారి అంతరాలయంలో బంగారు వాకిలి, తాపడానికి అయ్యే ఖర్చు సుమారు రూ.5 కోట్లు అందిస్తామని చెప్పారు. వెంటనే పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి, శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆవులపబ్బం


చాందినీ బండ్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామాల ప్రజలు

చౌడేపల్లె: మండలంలోని పన్నెండు గ్రామాల ప్రజలు కలిసి పరికిదొన గ్రామంలో ఏటా నిర్వహించే ఆవుల పబ్బం గురువారం కనుల పండువగా ప్రారంభమైంది. మహాశివరాత్రి పండుగ ముందువారంలో ఏటా ఆవులపబ్బం నిర్వహించడం పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తోంది. ఈ పండుగలను గ్రామస్తులు రెండు రోజుల పాటు ఘనంగా జరుపుకుంటారు. ప్రజలంతా పోటా పోటీగా పశువులను ముస్తాబు చేసి నాగప్ప చెరువులోని 12 గ్రామాలకు చెందిన పశువులను ఒకే చోటుకు గుంపుగా తోలి పశు సంపద పెరగాలని కోరుతూ కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేశారు. చాందినీ బండ్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో నుంచి నాగప్పచెరువు మీదుగా కాటమరాజుల ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సాయత్రం చిట్లాకుప్పకు నిప్పటించి పశువులపై ముద్దకూడును చల్లారు. పన్నెండు గ్రామాల్లో ప్రతి ఇంటా బంధుమిత్రులతో సందడి కనిపించింది.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

– జిల్లా కలెక్టర్ షణ్మోహన్


పోలియో చుక్కల కార్యక్రమం బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పోలియో రహిత సమాజమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గురువారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రూపొందించిన పోలియో చుక్కల కార్యక్రమం బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన జిల్లావ్యాప్తంగా పోలియో చుక్కల కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. 3వ తేదీ వేసుకోని పిల్లలకు 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు.

జిల్లావ్యాప్తంగా ఇలా..

జిల్లావ్యాప్తంగా 69 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ కేంద్రాల పరిధిలో 8 మంది ప్రోగ్రాం అధికారుల పర్యవేక్షణలో 142 రూట్లలో 1,415 కేంద్రాల పరిధిలో 20,9971 మంది 5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇందులో 149 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించామన్నారు. వీటిని మొబైల్ బూత్‌ల ద్వారా కవర్ చేస్తారని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా నోడల్ అధికారి, వ్యాధి నిరోధక టీకాల అధికారి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.రవిరాజు, డీపీఎంఓ డా.హర్షవర్ధన్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.సుదర్శన్, మున్సిపల్ ఆఫీసర్ డా.లోకేష్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ డా.శిరీష, డెమో జయరాముడు, ఏపీడిమియాలజిస్ట్ శ్రీవాణి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు బీభత్సం


మామిడి తోటలో రాతి కూసాలను కూలదోసిన ఒంటరి ఏనుగు

బైరాల: మండలంలోని వినాయకపురంలో గురువారం వేకువజామున ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. గ్రామంలోని రైతు మోహన్‌రెడ్డికి చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచేసి, తోటకు ఏర్పాటు చేసిన రాతి కూసాలను కూలదోశాయి. అలాగే వీరభద్రరెడ్డి అనే రైతుకు చెందిన నాలుగు రాతి కూసాలను ధ్వంసం చేశాయి. మరో రైతు వినయ్‌రెడ్డికి చెందిన బోర్ పైపులను తొక్కేయడంతో సుమారు రూ.15 వేల మేరకు నష్టం వాటిలినట్లు బాధిత రైతు వాపోయాడు. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

భారతదేశంలో సాంకేతిక విప్లవం


మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న అశోకరాజు

నారాయణవనం: ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ స్వీయ అభివృద్ధితో భారతదేశం సాంకేతిక విప్లవాన్ని సృష్టిస్తోందని డీఆర్‌డీఏ మాజీ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ శరవేగంగా వృద్ధిరేటును సాధించిందని అన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకుండా సొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుందని వివరించారు. మన దేశం సొంతంగా తయారు చేసిన ఎస్‌ఎల్‌వీ, ఏఎస్‌ఎల్‌వీ, జీఎస్‌ఎల్‌వీ, పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌లను విజయవంతంగా నింగిలోకి పంపిందని గుర్తు చేశారు. రక్షణ రంగంలో బ్రహ్మోస్, అగ్ని, అగ్ని-1,2,3, ఆకాష్, అర్జున్ ట్యాంకర్లు, న్యూక్లియర్ సబ్‌మెరైన్‌లతో దేశ రక్షణ బలాన్ని పెంచుకున్నామని అన్నారు. సబ్‌మెరైన్‌ల తయారీలో జర్మన్ తర్వాత మన దేశమే రెండో స్థానంలో ఉందని వివరించారు. నేడు ప్రపంచమే భారతదేశం వైపు చూసే స్థాయికి మనం సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి సాధించామని అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో యువ ఇంజినీర్లు పరిశోధనలు జరిపి దేశ ప్రతిష్టతను పెంచడానికి కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐఐటీతో పాటు ఐసర్‌ను అభివృద్ధి చేసిందని అన్నారు. కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకే పరిమితం కాకుండా దేశ రక్షణలో, సాంకేతిక అభివృద్ధికి యువ ఇంజినీర్లు ప్రత్యేక భూమికను పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం సతీష్‌రెడ్డిని శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రాజు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటో-బైక్ ఢీ: ముగ్గురికి తీవ్రగాయాలు


గాయపడిన ఆటోడ్రైవర్ శ్రీనివాసులు

వి.కోట: ఎదురెదురుగా వస్తున్న ఆటో, ద్విచక్రవాహణం ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బైరెడ్డిపల్లి మండలం పాతపేట గ్రామానికి చెందిన శివరాజ్ (48), శ్రీనివాసులు(30), మంజునాథ్(32) ఆటోలో వారి స్వగ్రామనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని వి.కోట-పలమనేరు జాతీయ రహదారిలోని టోల్‌గేట్ వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని బైక్‌ను ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది .ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆటోడ్రైవర్ శ్రీనివాసులు, శివరాజ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రులను వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే వెంకటేగౌడను సన్మానిస్తున్న వినోద్‌కుమార్ రెడ్డి

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ గుండ్లపల్లికి చెందిన జనసేన కీలక నాయకుడు ఎస్.వినోద్‌కుమార్ రెడ్డి తన కుటుంబీకులు, అనుచరులతో కలసి గురువారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఆ పంచాయతీ నాయకులతో కలసి వైఎస్సార్‌సీపీలో చేరారు. అతనికి ఎమ్మెల్యే పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాను జగనన్న పాలన చూసి ఆనందంగా పార్టీలో చేరుతున్నానని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఆయన ఘనంగా సన్మానించారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా సీఎం జగనన్న పాలనలో సాయం పొందిన ప్రజలు మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపిస్తారని తెలిపారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్ బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు, రాగులు, గోధుమలు చౌకదుకాణాలకు సరఫరా అందాయన్నారు. లబ్ధిదారులు తమ గడప వద్దే రేషన్ పంపిణీ వాహనం వచ్చినప్పుడు సరుకులు తీసుకోవచ్చన్నారు. సరుకులు ఇవ్వడంలో ఇబ్బందులు, వాహనం రాకపోయినా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదుచేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

వైభవం.. కల్యాణ వెంకన్న ధ్వజారోహణం


ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో టీటీడీ అనుబంధ శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన ధ్వజారోహణం ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. అనంతరం 7నుంచి 8.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, గరుడాళ్వార్, చక్రతాళ్వార్ ఉత్సవమూర్తులు తిరుమాడవీధుల్లో విహరిస్తూ బ్రహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. తదుపరి ఉదయం 8.40 నుంచి 9 గంటల మధ్య మీనలగ్నంలో అర్చకులు, విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ట, రక్షా బంధనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి సమక్షంలో గరుత్మంతుడి చిత్రం కూడిన వస్త్రానికి పూజలు చేసి, ధ్వజస్తంభంపై ఎగురవేయడంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు జేఈఓ

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. 4వ తేదీన గరుడ సేవ, 5న స్వర్ణ రథోత్సవం, 7న రథోత్సవం, 8న చక్రస్నానం ప్రధానమైనవని పేర్కొన్నారు. రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయన్నారు. బ్రహ్మోత్సవాల కారణంగా ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు. తొమ్మిదిరోజుల పాటు భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ ఉంటుందన్నారు. ఆలయం, పరిసరాల్లో భక్తులను ఆకర్షించేలా పుష్పాలంకరణలు, విద్యుద్దీపాల కటౌట్లు ఏర్పాటు చేశామన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూల ను ఇక్కడ భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చి నట్లు తెలిపారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన


బోయకొండ ఆలయంలో జరిగిన లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న దంపతులు

- పూజల్లో పాల్గొన్న 75 జంటలు
- వేదపండితుల ప్రత్యేక పూజలు
- నేటితో ముగియనున్న లక్ష కుంకుమార్చన

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఏటా వైభవంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన పూజలు రెండవ రోజైన గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తికి ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి దంపతులకు పూజాసామగ్రిని అందజేశారు. అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి, చండీహోమం, మహా మంగళహారతి చేశారు. రూ.1500 చెల్లించిన ఉభయదారులు 75 జంటల దంపతులకు వేద పురోహితుల మధ్య దంపతులు ఇద్దరిచే అమ్మవారి సన్నిధిలో లక్ష నామ గలార్చన మధ్య పూజలు చేయించారు. బోయకొండ ఆలయం వద్ద పూజల్లో పాల్గొనే దంపతులతో ఆలయంలో రద్దీ నెలకొంది. అనంతరం ఈఓ, ఆలయ అధికారులు ఉభయదారులకు తీర్థ ప్రసాదాలను దంపతులకు అందజేశారు.

నేటితో ముగియనున్న పూజలు

బోయకొండ గంగమ్మ ఆలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారంతో ముగియనున్నట్లు ఈఓ చంద్రమౌళి అన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.